# వసంత స్వప్నం...

-కుప్పిలి పద్మ

మరీ ప్రాతఃకాలపు వేళ. మబ్బులు రోడ్లూ యిళ్లూ యింకా నిద్రమత్తు విడవనే లేదు.

గది తలుపుని దబదబా బాదుతోంటే– వసంతం కమ్ముకొస్తోంది. అరణ్యాల మీంచి పొలాల మీంచి సెలయేటి తీరాల్లోంచి తోటల్లోంచి... పచ్చని కలని చెదరకొడుతూ తలుపుని బాదుతోంది ఎవరాని కలల రెప్పలని విప్పింది నిత్యకళ్యాణి.

ఆ శబ్దానికి నిద్రమత్తులోంచి విసుక్కుంటూ లేచి పక్కనున్న నిత్యకళ్యాణి మంచంవైపు చూసింది సంజన.

సంజనా కళ్లిప్పటం చూసి తిరిగి తన వసంతస్వప్నం కోసం కనురెప్పలని మూసుకొంది నిత్యకళ్యాణి.

'వూ... గాడ్... అనుకొంటూ చిరాగ్గా వెళ్లి తలుపు తీసింది సంజన. ఎదురుగా నైటీలో కేర్‌టేకర్. పక్కనే ఛామనచాయ రంగుతో బొద్దుగా ముద్దుగా గుండ్రని కళ్లతో పూలపూల సల్వార్ కమీజ్‌లో వొక్క జడతో కాస్త అలసిపోయిన ముఖంతో సుమారు తన వయస్సే వున్న అమ్మాయిని చూస్తూ 'కొత్త రూమ్మేట్' అనుకొంటూ సంజన గుమ్మానికి కాస్త పక్కగా తప్పుకొంది.

రెండు పెద్ద సూట్‌కేస్‌లు ఎర్ర ప్లాస్టిక్ డబ్బా నీలం ఎయిర్‌బ్యాగ్ నల్ల పొడవు హేండ్ బ్యాగ్‌తో లోపలికి వస్తూన్న ఆ అమ్మాయి షాట్స్‌లో వున్న సంజనాని చూసి 'ఏం వుద్యోగమో... చూడ్డానికి బానే వుంది' అనుకొంటూ నా మంచం ఏది. షెల్ఫ్ ఏది అని కేర్‌టేకర్ని అడిగింది.

కేర్‌టేకర్ వాటిని చూపించి 'మీ కొత్త రూమ్మేట్. న్యూస్ పేపరాఫీసులో వుద్యోగం. ప్రవీణ' అని సంజనాకి చెప్పి 'తన పేరు సంజనా. కాల్ సెంటర్‌లో జాబ్. ఆ నిద్రపోతున్న అమ్మాయి నిత్యకళ్యాణి. టి.వి.లో పొలిటికల్ రిపోర్టర్' అంది.

'మీదే వూరు' ప్రవీణ అడిగింది.

'బాంబే'

'బాంబే... అక్కడ కాల్ సెంటర్స్ లేవా' అడిగింది ప్రవీణ.

'తెలియదు... కనుక్కొని చెపుతా' యింగ్లీషులో అనేసి వెళ్లి తన మంచంపై పడుకొంది సంజన.

ప్రవీణ రాకతో చెదిరిపోయిన తన స్వప్నాన్ని తిరిగి చూడాలని నిద్రపోవటానికి ప్రయత్నిస్తోంది నిత్యకళ్యాణి. నిద్రరావటం లేదు. కల తిరిగి వచ్చే అవకాశం కనిపించటం లేదు. వుత్తినే అలా మంచంపై దొర్లలేక లేచి కూర్చుంది. ప్రవీణ తన మంచంపై హాయిగా నిద్రపోతోంది. సంజన తన మంచంపై లేచి కూర్చుంటూ 'మన నిద్ర చెడగొట్టి తను మాత్రం ఎంత హాయిగా నిద్రపోతోందో చూడు' అంది.

బద్ధకంగా నవ్వి 'వాక్‌కి వెళదామా' అని అడిగింది నిత్యకళ్యాణి.

యిద్దరూ బయటకొచ్చారు. పంజాగుట్ట సెంటర్ వరకు వచ్చి మూలమీదున్న టీ బండి దగ్గర ఆగారు.

టీ తాగుతూ యిద్దరూ పక్కనే వున్న బండ మీద కూర్చున్నారు.

'ఎం.బి.ఎ.కి కట్టాను. స్టడీ మెటీరియల్ వచ్చింది. చదవటం మొదలుపెట్టాలి. రేపు మా ఆఫీస్‌లో పార్టీ వుంది. ఐబ్రోస్ పెరిగిపోయాయి. పార్లర్‌కి వెళ్లాలి. ఫేషియల్ చేయించుకోవాలి. రాత్రంతా నిద్రపోయి ఎన్నాళ్లయిందో' అంది సంజన.

'నీకీ రోజు సెలవ్‌గా. యీ పనులన్నీ యివాళే పూర్తి చేసుకో. రేపు ఫ్రెష్‌గా పార్టీకి వెళ్లొచ్చు. ఐబ్రోస్ చేయించుకోవాలి. అస్సలు టైమ్ దొరకటం లేదు. వో కొత్త ప్రోగ్రామ్ ఆలోచించా. ఆ ప్లానింగ్‌తో బిజీ' అంది నిత్యకళ్యాణి.

వుద్యోగాలు చేస్తూ క్వాలిఫికేషన్స్ పెంచుకొంటూ బాడీ మేన్‌టైన్ చేస్తూ మరోవైపు పర్సనల్ లైఫ్‌లో సెటిల్ అవ్వటానికి ట్రై చేస్తూ యిలా పరిగెడుతుంటే మా మమ్మీకి మన లైఫ్ చాలా బాగుందంటా. వాళ్ల టైమ్‌లో చదువు, వుద్యోగం పెళ్లి. యింతేనంట. మీరెంత కష్టపడితే మీకంత బ్రైట్ ఫ్యూచర్ అంటుంది' అంది సంజన.

'కానీ మనకి ప్రతి విషయంలోనూ యిన్‌సెక్యూరిటి వుంది కదా. పరుగు ఆపినా కష్టమే. కాస్త తక్కువ పరిగెత్తినా కష్టమే. బాగా పరిగెత్తినా వొక్కోసారి గ్యారెంటీ లేదు. కాకపోతే యిప్పుడు ఎలాగోలా ఎందులోనైనా నిలబడగలిగే వాతావరణం వున్నట్టు వుంది. యిది మాయ కావొచ్చు. లేదా భ్రమా కావొచ్చు. కానీ మనం కావాలనుకునే ఫీల్డ్‌లోకి వెళ్లే అవకాశం వుంది. దానికోసం మనం బాగా పరిగెత్తాలి. పరిగెత్తలేకపోవటం మన లోటే అవుతుంది కాని ఆ బాధ్యతని తీసుకొనే సిస్టమ్ యిప్పుడు మన చుట్టూ లేదు. ప్రతి విషయంలోనూ యిన్‌సెక్యూరిటీనే. వొక్కోసారి యీ నిశ్చింత లేనితనం విసుగ్గా వుంటుంది' టీకి డబ్బులిస్తూ అంది నిత్యకళ్యాణి.

'యింత ఎనలిటికల్‌గా విషయాలు నీకెలా తెలుస్తాయి' అడిగింది సంజన.

'సాహిత్యం... అని నవ్వి 'యిప్పుడు ఎనలిటికల్‌గా విషయాలు తెలియకపోయినా పర్లేదు. కానీ పాపులర్‌గా తెలియాలి' అంది నిత్యకళ్యాణి.

'అంటే'

'కాస్త పాపులర్ రిపోర్టింగ్ చేయమంటున్నారు మా బాస్' అంటూ చిన్నగా నవ్వింది.

'గుడ్... గుడ్... పార్టీస్ ఫ్యాషన్ షోస్ గాసిప్... రేపు మా పార్టీ రిపోర్ట్ చెయ్... మంచి యీజిప్షియన్ పెర్‌ఫ్యూమ్ వేసుకెళతా... మా పాత టీమ్ లీడర్ మారిపోయింది. పెద్ద రిలీఫ్ యీ కొత్త బాస్ ఫన్ లవింగ్. పని. గుడ్ పార్టీస్. హేపీ...' యిద్దరూ హాస్టల్‌కి వచ్చేసరికి హాల్లో హాస్టల్లో అమ్మాయిలు టి.వి. చూస్తూ ఫేస్ పేక్స్ ఆరపెట్టుకొంటూ పేపర్ చదువుతూ త్వరత్వరగా బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఆఫీసులకి లంచ్ బాక్స్ సర్దుకొంటూ సెల్‌ఫోన్స్‌లో మాట్లాడుతూ హడావుడిగా వున్నారు. వీళ్లిద్దరూ రూంలోకి వచ్చేసరికి ప్రవీణ సామాను సర్దుకోవడంలో బిజీగా వుంది.

కళ్యాణి రెడీ అయి వెళ్లిపోయింది.

జీన్స్‌లో రెడీ అయి సంజన బయటికి వెళ్లబోతుంటే 'నాకీ వైపు నచ్చలేదు. మీరు నేనూ మంచాలు మార్చుకుందామా' అడిగింది ప్రవీణ.

'మారిస్తే నాకూ నచ్చదే... ఎలా.'

'పోనీలెండి కళ్యాణి గారిని అడుగుతా' నా జీన్స్ టాప్స్ షాట్స్ సర్దుకొన్న బ్యాగ్ ట్రైన్‌లో మిస్ అయింది. కొత్తవి కొనుక్కోవాలి. ఎక్కడ బాగుంటాయి' అడిగింది ప్రవీణ.

'చాలా చోట్ల బాగుంటాయి. లైఫ్ స్టయిల్, షాపర్ స్టాప్, వెస్ట్ ఎండ్ మీ యిష్టం' అంది సంజన.

'మీరెక్కడ కొంటారు.'

'మా వూరు నుంచి తెచ్చుకొన్నవే. యిక్కడెప్పుడూ కొనలేదు' అంది సంజన.

'షాపింగ్‌కి వస్తారా' అడిగింది ప్రవీణ.

'టైమ్ లేదు. బై' అంది సంజన.

'మహా టెక్కులా వుందే... తన బ్యాగ్ విషయం అబద్ధమని పసికట్టిందా' అనుకొంది ప్రవీణ.

ప్రెస్ క్లబ్‌లో పుస్తకావిష్కరణ వుంటే కవరేజ్‌కి వెళ్లింది నిత్యకళ్యాణి. బయటికి వస్తుంటే 'హలో' అని వినిపిస్తే వెనక్కి చూసింది.

శిరీష్... కవి. ప్రస్తుతం వో న్యూస్ పేపర్‌లో వుద్యోగం.

'హలో' అంది.

'జాబ్ ఎలా వుంది' అడిగాడు.

'గుడ్'

'బిజీనా...'

'ఏం'

'డిన్నర్‌కి వెళదామా...'

'డిన్నర్...'

'వూ... నా బర్త్‌డే'

'వొ... మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'

'వస్తారా'

'ఎక్కడ'

'మీరు చెప్పండి'

'మీరు చెపితేనే మంచిది. మీకు నచ్చే ప్లేస్ తెలియదుగా'

'యిప్పుడు ఆఫీసుకా' అడిగాడు.

'ఆ'

'మీ పని అవ్వగానే బంజారాహిల్స్‌లో కె.బి.ఆర్. పార్క్ దగ్గరకి రండి' అన్నాడు.

ఆమె అక్కడికి వెళ్లింది. అప్పటికే అక్కడ ఎదురుచూస్తున్న శిరీష్ ఆమెని తీసుకొని రెస్టారెంట్‌కి వెళ్లాడు.

లాన్‌లో వో మూల కూర్చున్నాక 'వస్తారో రారో అనుకున్నా థ్యాంక్స్' అన్నాడు.

ఆరుబయట వాలుతోన్న నక్షత్ర కిరణాలని చూస్తూ 'మీరేవూర్లో పుట్టారు' అని అడిగింది.

'విజయవాడ'

'ఎన్ని గంటలకి'

'ఏమో... నేనెప్పుడూ యీ విషయం మా అమ్మని అడగలేదు' అన్నాడు చిన్నగా నవ్వి 'వుండండి యిప్పుడే

అడుగుతా' అని వెళ్లి వాళ్ల అమ్మగారికి ఫోన్ చేసాడు.

కాసేపు మాట్లాడివచ్చి 'సాయంకాలం తొమ్మిదిన్నరకంటా' అన్నాడు.

'సో మీరింకా పుట్టలేదన్నమాట' అంది.



ఆర్డర్ చేసి సాహిత్య లోకపు కబుర్లు చెప్పుకొంటున్నారు.

అతని కవిత్వంలోని తడి ఆమెకి నచ్చుతుంది. అపారంగా సాహిత్యాన్ని చదువుకొన్న అనుభవం. విషయాలని విశ్లేషించే తీరు ఆమెని ఆకర్షించేవి. ఎప్పుడైనా కనిపించినప్పుడు ఏకధారగా మాట్లాడేవాడు. యిలా ఏకాంతంగా వో చోట కూర్చుని యిష్టమైనవి తింటూ కబుర్లు చెప్పుకోవడం యిప్పుడే. తొమ్మిదిన్నర అవుతోంటే 'యిప్పుడే వస్తా' అని వెళ్లి తిరిగొచ్చి అతనికి లిల్లీపువ్వుల గుత్తిని అందించింది. వాచ్ వైపు చూసుకొంటూ అందుకొన్నాడు.

అతను ఆశ్చర్యానందాలతో చిరునవ్వుని దాచుకోలేకపోయాడు.

'నాకెంతో యిష్టమైన పువ్వులు యివి' అన్నాడు.
'తెలుసు'
'ఎలా'
'మీ వాక్యాలకి వున్నది యీ పరిమళమేగా...' అంది చిరునవ్వుతో.
ప్రకాశవంతమైన ఆ మాటలకి అతను కదిలిపోయాడు.
యింత సంతోషాన్ని వూహించలేదు.
బిల్ పే చేస్తుంటే అతనికి యింకాసేపు వుండాలనిపించింది. సాధారణంగా సాగిపోతోన్న జీవితంలో ఆమె ప్రశంస అతనిలో నింపిన భావోద్వేగంతో అతను యింకొంచెం సేపు ఆమె సమక్షంలో గడపాలనుకున్నాడు. కానీ సాధ్యమయ్యేలా కనిపించలేదు. రెస్టారెంట్ మూసే సమయం అయింది.
యిద్దరూ బయటకి వచ్చారు.
'థ్యాంక్ యూ వెరీ మచ్. బాగా గుర్తుండిపోయే పుట్టినరోజు' అన్నాడు.
ఆమె చిన్నగా నవ్వి 'గుడ్ నైట్' అని వెళ్లిపోయింది.
అలా అప్పుడప్పుడు వాళ్లిద్దరూ కాఫీ షాప్‌లో కలుస్తుండేవారు. సాహిత్య విషయాలు దొర్లుతుండేవి. పుస్తకాలలో విషయాలని చర్చించుకునేవారు. అతను ఆమెకి తను రాసినవి కొత్తగా చదివిన తనకి నచ్చిన కవిత్వం ఆమెకి వినిపిస్తుండేవాడు. మధ్యమధ్యలో తమ యింటి విషయాలు పంచుకొనేవారు. 'సాహిత్య సభకి విశాఖ వెళ్లి అక్కడ నుంచి సభకి వచ్చిన మిత్రులంతా కలసి సరదాగా అన్నవరం వెళదాం అనుకుంటున్నాం వస్తారా' అడిగాడు శిరీష్.
'వూ... వస్తా' వుత్సాహంగా అందామె.
'అక్కడ నుంచి అరకు, సింహాచలం, అన్నవరం కూడా వెళుతున్నాం అంతా' అన్నాడు.
దూరంగా పల్చని నీలికెరటాల్లా కొండలు. నిశ్చలంగా పంపా సరసు. తురాయి పూలు పూసిన కొండ. మెట్ల మీద పల్చని గీతలు. సువర్ణగన్నేరు పువ్వుల హాయైన గాలుల అలలు మెత్తగా స్పృశిస్తుంటే ప్రభాతవేళ అన్నవరం దేవాలయపు మెట్ల మీద కూర్చుంది నిత్యకళ్యాణి. ఆమె పక్కనే వచ్చి కూర్చున్నాడు శిరీష్.
అతనివైపు చూస్తూ మెత్తని నవ్వు నవ్విందామె పలకరింపుగా.
'ఎంతో బాగుంది కదా. మనం యీ వుదయాలని మిస్ అవుతున్నాం' అన్నాడు.
'నచ్చితే యిక్కడే వుండిపో శిరీష్' అంది.
'మరి నువ్వో'
'ముందు నీ బిజీ లైఫ్‌ని వదులుకొని యిక్కడ సింపుల్‌గా వుండగలవా' అడిగింది.
'నువ్వూ... నువ్వు చెప్పు.'
'ప్రతిదానికీ నువ్వూ... నువ్వు చెప్పు... అంటావేంటి. నువ్వేం అనుకుంటున్నావో ఆ విషయం చెప్పు.' అతను మాట్లాడలేదు.
కాసేపయ్యాక యిలాంటి వుదయాలలో మూలాలు వుండటంతో ఎదురుపడగానే యివి కావాలనిపిస్తాయి. కానీ వీటి నుంచి వేరు చేయబడి చాలాకాలం అవ్వటం, యిక్కడుండి ఏం చెయ్యాలో తెలియదు. నగరంలోని ఆ వేగం ఆ మెరుపు ఆ కొత్తదనంలో ఏదో మత్తు వుంటుంది. ఆ మత్తుకి అలవాటుపడ్డాను. ఆ మత్తు కావాలి. పసితనపు జ్ఞాపకాలని కలబోసుకోడానికి నీలాంటి స్నేహితురాలు కావాలి. చాలా రోజులుగా చెప్పాలనుకుంటున్నా మనం పెళ్లి చేసుకుందామా నిత్యకళ్యాణీ అని అడిగాడు.
అతన్నుంచి వచ్చిన యీ ఆహ్వానానికి ఆమె పెద్దగా ఆశ్చర్యపోలేదు. అతనికి తన పట్ల ఆత్మీయత వుందని తెలుసు. కానీ యీ ఆత్మీయతని జీవితంలోకి ఎలా అనువదించుకోవాలనుకుంటున్నాడో కచ్చితంగా తెలియదు. యిప్పుడిలా అతను స్పష్టంగా తన మనసులో మాట చెప్పాడు.
'ఏమంటావ్' తిరిగి అడిగాడు.
ఆమె చిన్నగా నవ్వి 'కాదనటానికి కారణాలేం కనిపించటం లేదు' అంది.
అతని హృదయం ఉప్పొంగింది.

ఈ పెద్ద నగరంలో తనకొచ్చే జీతంతో చాలా సాదాసీదా జీవితం గడపాల్సి వస్తుందని ప్రవీణ రెండ్రోజుల్లోనే గమనించింది. కాస్త మంచి ఉద్యోగంలోకి మారిపోవాలని నిర్ణయించుకొని చుట్టూ చూపులు ప్రసరించింది. ఏఏ అవకాశాలు వున్నాయో రాసుకొంది. నిత్యకళ్యాణితో అతి మృదువుగా మాట్లాడుతూ మెల్లగా ఓ టి.వి. ఛానల్లో ఆమె ద్వారా పరిచయాలు పెంచుకొంది. ఉద్యోగం సంపాదించింది. యాంకర్ మాట్లాడే మాటలు రాసే ఆ ఉద్యోగం నుంచి యింకా పైపైకి వెళ్లి ఆ రంగంలో ఎలా నిలదొక్కుకోవాలా అని ఆలోచిస్తోంది.
'పార్టీ యివ్వు' సంజనా నిత్యకళ్యాణిని పదేపదే అడుగుతోంది.
'నువ్వే యివ్వు' అందామె.
'నేనా...ఎందుకు...'
'నీ స్నేహితురాలికి మంచబ్బాయి దొరికాడని' అంది నిత్యకళ్యాణి.
'ఏంటి విషయం... భలే హేపీగా వున్నారే' అంటూ గదిలోకి వస్తూ అడిగింది ప్రవీణ.
'నిత్యకళ్యాణి పెళ్లి' సంతోషంతో చెప్పింది సంజన.
'ఓ... కంగ్రాట్స్... ఎప్పుడు, ఎక్కడ?' అడిగింది ప్రవీణ.
'శిరీష్ అని ఓ జర్నలిస్ట్, కవి' అంది సంజన.
'బాగా రాస్తాడా' అడిగింది ప్రవీణ.
'చాలా బాగా... పార్టీ యివ్వు' అంది సంజన.
'మనమే యిద్దాం... మాకు అతన్ని పరిచయం చెయ్యి' అడిగింది ప్రవీణ.
'యిప్పుడప్పుడే కాదు. యింకా టైమ్ వుంది. సంజనాకి కాస్త తెలుసు అతను. త్వరలో పరిచయం చేస్తాలే' అంది నిత్యకళ్యాణి.
సంతోషంతో మిలమిలా మెరుస్తోన్న నిత్యకళ్యాణి కళ్లు చూస్తుంటే ప్రవీణకి లోలోపల మంటగా అనిపించింది. తమ పెళ్లిళ్ల విషయం పట్టించుకోని యింటి పరిస్థితి గుర్తొచ్చింది. సరియైన వాడిని వెతుక్కోవటానికి యిక్కడ టైమ్ దొరకటం లేదు. 'ఎవరీ శిరీష్?' ఆలోచిస్తోందామె.
ఎప్పుడూ ప్రశాంతంగా వుండే నిత్యకళ్యాణిని చూస్తుంటే తనకి ఎందుకలాంటి స్థితి లేదోననే అసూయ ఆమెలో నిగూఢంగా.
రెండ్రోజుల తరువాత శిరీష్‌కి కాల్ చేసి 'మీ కవిత ఒక్కటి కావాలండి. కవి సమ్మేళనం ప్లాన్ చేస్తున్నాం' అని అడిగింది ప్రవీణ.
'మీరు'
'మీకున్న అనేక వేలమంది అభిమానుల్లో నేనొక్కదాన్ని' అంది.
శిరీష్ సంతోషాన్ని దాచుకోడానికి ప్రయత్నిస్తూ 'అంతమంది అభిమానులేం లేరండి' అన్నాడు మొహమాటంగా.
'ఆс ఆ విషయం నాకు తెలుసులే' అని మనసులో అనుకుంటూ, 'ఎప్పుడిస్తారు?' అని అడిగింది.
'ఎక్కడిమ్మంటారు?'
'పోస్ట్ చేయండి. అయితే మీరీ విషయం మీలోనే వుంచుకోండి. ప్రొఫెషనల్ సీక్రెట్ అనుకోండి' అంది.
'ష్యూర్... ష్యూర్...'
'బై' అంది.
శిరీష్‌కి లోలోపల ఓ ఉత్సాహపు పవనం.
నిత్యకళ్యాణికి చెపుదామా అనిపించింది. అంతలోనే ప్రవీణ ఎవ్వరికీ చెప్పొద్దనటం గుర్తొచ్చింది.
టి.వి.లో తన కవిత రావటం... గ్రేట్ అనుకున్నాడు.
ప్రవీణకీ సరదాగా అనిపించింది... శిరీష్‌ని కదపగలిగింది.
అతను తన కవితని మర్చిపోకుండా ఆమె చెప్పిన ఎడ్రస్‌కి పోస్ట్ చేశాడు.
ఓ రెండ్రోజుల తర్వాత శిరీష్‌కి కాల్ చేసి 'బాగుంది మీ కవిత. వండర్‌ఫుల్' అంది.
'మీ ఫేవరెట్ కవులు ఎవరు?' అడిగింది.
అతను చెప్పిన పేర్లు విని ఎందుకు వాళ్లంటే యిష్టమని అడిగింది.
అతను సిన్సియర్‌గా ఆమె అడిగినవాటికి జవాబులు చెపుతున్నాడు.
'మీ ఫొటో ఒకటి పంపించండి' అడిగింది.
'ఫొటోనా... ఎందుకండి... పబ్లిసిటీ యిష్టం లేదండి' అన్నాడు.
'ఏంట్... తెలుసులే... పబ్లిసిటీ యిష్టం వుండదు... గుర్తింపు యిష్టంలేని వాళ్లెవ్వరు! అమాయక చక్రవర్తీ తెలుసులే' యీ మాటలు అనుకొంటూ 'మీకిష్టం వుండదని తెలుసు. కానీ మిమ్మల్ని చూడాలని మీ అభిమానులు చాలా చాలా కోరుకుంటారు. అభిమానుల కోసం...' అందామె నమ్రతగా.
శిరీష్‌కి తను చేస్తున్న ఉద్యోగం నుంచి మారిపోవాలని వుంది. టి.వి.లోకి వెళ్లటం ఎలాగా అని ఆలోచిస్తున్నాడు. నిత్యకళ్యాణిని అడుగుదామనుకున్నాడు.
ఓ రోజు ప్రవీణ కాల్ చేసి కవిత్వం విషయాలు మాట్లాడి, 'మీకు టి.వి.లోకి వచ్చే ఆసక్తి వుందా!' అని అడిగింది.
'ఉంది. కాని సోర్స్ తెలియదు' అన్నాడు.
'నేనో సోర్స్ చెపుతా. ప్రయత్నించండి' అంది.
'థాంక్యూ' అన్నాడు.
'నాకేమిస్తారు జాబ్ వస్తే?'
'రావాలే కాని మీరే పార్టీ అడిగినా యిస్తా'
'పార్టీ... పార్టీ కాదు. మీకు ఆ ఉద్యోగం ఎలా వస్తుందో, ఎవరితో మాట్లాడితే వస్తుందో నే చెపుతా. చాలా కాంపిటీషన్ వుందా ఉద్యోగానికి. మీకు క్వాలిఫికేషన్ వుంది. మీకా జాబ్ వస్తే మీరూ నన్ను నా ప్రొఫెషన్‌లో ఎంకరేజ్ చేయాలి. మీకూ, నాకూ

పరిచయం వున్నట్టు కానీ, రెగ్యులర్ కాంటాక్ట్‌లో వుంటున్నట్టు ఎవరికీ యిప్పుడప్పుడే తెలియకూడదు. జాబ్‌లో మీరు సెటిల్ అయ్యాకే మనిద్దరికి పరిచయం వున్నట్టు తెలియవచ్చు. అంతే... సరేనా! మనిద్దరి డీల్ ఏమాత్రం బయటికి వచ్చినా జాబ్ వచ్చే అవకాశాలు తక్కువ' అని కాస్త బెదిరించింది.

ఈ ప్రొఫెషన్‌లో తన టాలెంట్‌పై తను నెగ్గుకు రాలేనని ప్రవీణకి తెలుసు. మిగిలిన యాంకర్స్‌కి వున్నంత అందం, గ్లామర్, వాక్చాతుర్యం తనకి లేవని ఆమెకి తెలుసు. తనని ప్రమోట్ చేసే వ్యక్తి కావాలి. ఆ మనిషికి అంతో యింతో పవర్ లేకపోతే తను ఆ ప్రొఫెషన్‌లో కంటిన్యూ కాలేనని ఆమెకి తెలుసు. అలవాటు పడాలి తన ముఖానికి ప్రేక్షకులు. అంతవరకు తను నెగ్గుకురావాలంటే తన మాట వినే వ్యక్తి అధికారంలో వుండటం అవసరం. మోస్ట్ ఎలిజిబుల్ వ్యక్తి శిరీష్ అని ఆమెకి నమ్మకంగా అనిపించింది.

రంగురంగుల కొవ్వొత్తులు ముచ్చటైన ఆకృతుల్లో... ఓ గుండ్రని చిన్ని టేబిల్‌కి అటూ యిటూ కుర్చీలు... నీళ్లపై తేలుతోన్న పసుపు ఎరుపు గులాబి తెలుపు పువ్వుల రేకులు... లేత వెలుగులో వీస్తోన్న లేత పరిమళం... పెర్ఫ్యూమ్ కేండిల్ వెలుగు చిమ్ముతోన్న వైట్‌వైన్ గ్లాసుని పట్టుకొన్న కుడిచేతి వేలి గోళ్లపై మెరుస్తోన్న బ్రౌన్ నైల్‌పాలిష్. శిరీష్ తన చేతిని చాచి ఆమె వేళ్లని మెల్లగా స్పృశిస్తూ 'థాంక్యూ' అన్నాడు. ఆమె అతని కళ్లల్లోకి చూస్తూ సమ్మోహనంగా నవ్వి 'ఉద్యోగం వచ్చేసింది. యిలా మిమ్మల్ని యిప్పుడు చూడటం గమ్మత్తుగా వుంది. గుడ్ పార్టీ, గుడ్ కంపెనీ. ఒక్కసారైనా మాట్లాడాలనుకున్నాను. మీరింత అందంగా వుంటారని తెలియదు. ఐ లైక్ యూ...'

జీవితం ప్రతి మలుపులోనూ అసాధారణమైన ఆనందాన్ని, అనుభవాలని కోరుకుంటూ ఒక చిన్న వూర్లో పుట్టి, ఓ సాధారణమైన బడిలో, కాలేజ్‌లో చదువుకొని పై చదువులు చదువుకునే తెలివితేటలున్నా ఆర్థికంగా అవకాశం లేక అందివచ్చిన అవకాశాలని వెతుక్కుంటూ అందుకొంటూ యీ నగరానికి వచ్చిన అతనికి తొలిరోజుల్లోని పరిచయాలు చిన్న చిన్న స్నేహాలు ఆనందాన్నిచ్చేవి. సరియైన ఉద్యోగం లేదని బంధువులే పిల్లనివ్వటానికి జంకుతున్న రోజుల్లో తనకి నచ్చిన వరసకి మావయ్య కూతురైన అమ్మాయికే తన మనసుని చెప్పలేకపోయాడు. తను ఓ పేపర్‌లో పనిచేస్తున్న కాలంలో తనకంటే మంచి ఉద్యోగం చేస్తున్న నిత్యకళ్యాణిని యిష్టపడుతున్నప్పుడు కాస్త బెరుగ్గానే ఆమెకి విషయం చెప్పాడు. నిత్యకళ్యాణి తనని ఒప్పుకోవటం తనకెంతో ఆనందాన్నిచ్చింది. ప్రవీణ ప్రోత్సాహంతో తను ప్రయత్నించగా టి.వి.లో మంచి ఉద్యోగం... ఒక్కసారిగా తన చుట్టూ తనెప్పుడూ ఊహించని రీతిలో రకరకాల మనుషులు... తన పరపతి పెరుగుతోంటే తన చుట్టూ అనేకానేక పరిచయాలు...

యిప్పుడు ప్రవీణ... యాంకర్‌గా ఎదగాలని ప్రయత్నిస్తోన్న ప్రవీణ తనని కోరుకొంటోంది. అతనికి చప్పున నిత్యకళ్యాణి గుర్తొచ్చింది. ఒక్కసారి తల విదిల్చాడు. మనుష్యులు ఎదిగే కొద్దీ అభిప్రాయాలు, యిష్టాలు మారుతుంటాయి. యిష్టపడే వాళ్లు పెరుగుతుంటారు. కాదనలేం కదా...

ఆ లేత వెలుగులో మెరుస్తోన్న అతని చేతివేళ్లపై చిన్నగా ముద్దు పెట్టింది ప్రవీణ.

ఆ ముద్దు ఆమె జీవితాన్ని ఆమె ఆశించని రీతిలో వెలిగించింది.

శిరీష్ ప్లాన్ చేసిన ఓ పాపులర్ షోకి తరువాతి వారంలో ఆమె యాంకర్ అయింది.

రెండు నెలలుగా ఎలాగైనా ఒక్కసారి శిరీష్‌ని కలవాలని నిత్యకళ్యాణి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించలేదు. శిరీష్ అతి చాకచక్యంగా ఆమెని కలవటాన్ని పోస్ట్‌పోన్ చేస్తున్నాడు. ఎప్పుడు ఫోన్ చేసినా ఏదో ఒక పని కష్టం చెప్పి బిజీ అని తప్పించుకొంటున్నా, అదంతా నిజమే అని నమ్మిందామె. కొత్త ఉద్యోగం... బిజీ అనుకొందామె.

'చాలా రోజులైంది శిరీష్... ఒక్కసారి కనిపించు. కాఫీ తాగినంత సమయం' అంది.

'సరే, పార్క్ దగ్గర వుండు' అన్నాడు.

'పార్క్ బయటా' అడిగింది.

'ఆఁ... ఆ అక్కడొద్దు... ఆ దారిలో వెళితే పొరపాటున ప్రవీణా తెలిసినవాళ్లు కనిపిస్తే కష్టం' అని ఆలోచించి 'సికింద్రాబాద్ కామత్‌కి రా' అన్నాడు. యీ సర్కిల్ వాళ్లు ఎవ్వరూ అటు రారని అతనికి బాగా తెలుసు.

ఆమె అక్కడికి చేరుకొని ఎదురుచూస్తోంది.

అతను బయలుదేరే సమయానికి సరిగ్గా ప్రవీణ కాల్ చేసింది. కాకతీయాలో ఎదురు చూస్తుంటా రా రమ్మని. నిత్యకళ్యాణి కాల్ చేస్తుందేమోనని స్విచాఫ్ చేశాడు సెల్‌ని. అతను పరవశంతో వెళ్లిపోయాడు.

బిల్ పే చేస్తుంటే అతనికి నిత్యకళ్యాణి గుర్తొచ్చింది. ఆఁ కాసేపు చూసి వెళ్లిపోతుందిలే అనుకున్నాడు.

చూసీ చూసీ అతని సెల్‌కి కాల్ చేసింది. స్విచాఫ్ చేసుంది.

బిజీగా ఉన్నాడేమోలేననుకుని హాస్టల్‌కి వెళ్లిపోయింది.

సంజనాకి ఏం పాలుపోలేదు. యిదంతా నిత్యకళ్యాణికి ఎలా చెప్పాలి. ప్రవీణని శిరీష్‌తో చూసినప్పుడు ఆమెపై చెప్పలేనంత కోపం వచ్చింది. ఆమె మాటలు వింటున్నప్పుడు అసహ్యం వేసింది. యిప్పుడు తీరిగ్గా ఆలోచిస్తుంటే ప్రవీణ మాటలు వాస్తవంగానే తోస్తున్నాయి. సంజనా తన ఆలోచనతో తర్జనభర్జన పడుతుండగా నిత్యకళ్యాణి గదిలోకి వచ్చింది.

'అరే... ఏంటలా వున్నావ్' ఆత్రంగా అడిగింది కళ్యాణి.

ఆత్మీయత నిండిన ఆ సజల నేత్రాలని చూస్తుంటే సంజనాకి దుఃఖం వచ్చింది. తనకి తెల్సినంతవరకు నిత్యకళ్యాణి ఎవరిని కష్టపెట్టటం చూడలేదు. యింత గాయాన్ని యీమె భరించగలదా... చెప్పకపోతే ఆమె యింకా భ్రమలోనే వుంటుంది. కష్టమో, నష్టమో ఏది ఏమైనా ముందు ఆమె ఆ భ్రమలోంచి బయటకి తీసుకురావాలి.

'యివాళ ప్రవీణని, శిరీష్‌ని చాలా దగ్గరగా క్లబ్‌లో చూశా. ప్రవీణని ఏంటని అడిగా. ప్రవీణ ఏమందంటే...'

'ప్రవీణా... యిందాక నీతో వున్న అబ్బాయి ఎవరు' అడిగింది సంజన.

'నీకెందుకు... అయినా నీకు తెలియదా' అంది నవ్వుతూ.

'అతనూ, నిత్యకళ్యాణీ పెళ్లి చేసుకోవాలనుకున్నారు'

'అయితే'

'చూడు ప్రవీణా... మీ యిద్దర్నీ నేను చాలా దగ్గరగా చూశా. గత కొంతకాలంగా అతను కళ్యాణిని సరిగ్గా కలవటం లేదు. అతను పనిలో బిజీ అనుకుంటుందామె. పని బిజీనా... లేక మీరిద్దరూ బిజీనా తెలియాలి' అడిగింది సంజన.

'అతను నన్ను యిష్టపడితే నేనేం చేయను' అంది ప్రవీణ.

'ముందు కళ్యాణిని యిష్టపడి, యిప్పుడు నిన్ను యిష్టపడి అతనిలో కన్సిస్టెన్సీ లేదని నీకు అనిపించటం లేదా'

'ఆఁ అంత కన్సిస్టెన్సీ నాకవసరం లేదు. చూడ్డానికి బానే వున్నాడు. సంపాదిస్తున్నాడు. పేరు, డబ్బు సంపాదించే అమ్మాయి తన గర్ల్‌ఫ్రెండ్ అని చెప్పుకోవటాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. నన్ను ప్రమోట్ చేస్తున్నాడు. చాలవా యివి' అని అడిగింది ప్రవీణ.

'రేపు మరొకరిని యిష్టపడితే'

'శిరీష్ కంటే బెటర్ అవకాశాలు నాకిప్పించే వాళ్లని నేను యిష్టపడనని గ్యారెంటీ ఏం లేదు. యిదిగో నేనెప్పుడూ శిరీష్‌కి నిత్యకళ్యాణిని మాట్లాడొద్దని చెప్పలేదు. అతనూ యిప్పటివరకూ ఆమె పేరు నా దగ్గర ఎత్తలేదు. అతను కళ్యాణిని ఎవాయిడ్ చేస్తున్నాడని తెలుసు' అంది

## దసరా (నా)నేడు

**నాడు**

అయ్యవారికి చాలు ఐదు వరహాలు
మాకు చాలు పప్పుబెల్లాలు
రంగురంగుల జండాలతో బాణాలతో
ముద్దుముచ్చటగ కదిలే బాలబాలికలు
పులి వేషాలు, ఆయుధ పూజలు
శమీశమీరే పాపం
శమీశత్రు వినాశనం
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శనం
శమీ చెట్టు క్రింది రాతలు
ఇచ్చుకుంటున్న బంగారం
తీసుకుంటున్న బంగారం
అది దసరా సరదా

**మరి నేడు**

పుస్తకం పట్టుకొని
వాడ వాడ వీధి వీధిని
గడప గడప తిరుగుతూంది
మందు కోసం విందు కోసం
మామూళ్ల వసూళ్లు
మూడు బ్రాందీలు
ఆర్లు బార్లకు వాకిళ్ల
నేటి దసరా సరదా...

– కొలనుపాక మురళీధరరావు

ప్రవీణ.

'ఎలా'

'నువ్వంటే యిష్టమని చెప్పిన మగాడిని గుడ్డిగా నమ్మటానికి నేనేమైనా నిత్యకళ్యాణినా. నా వేగులు నాకున్నారు. నిత్యకళ్యాణికి డీల్ చేసుకోవటం రాలేదు. డీల్ చేయలేదు కూడా. ఎందుకంటే యిప్పుడు బంధాలు, సంబంధాలకి ప్రాతిపదిక, అవసరాలు, ప్రేమ కాదు. సిన్సియారిటీ అసలే కాదు. బిజినెస్ డీల్. అంతే మనకి యిష్టం వున్నా, లేకపోయినా మనం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా మనం అన్ని రకాలుగా ఎదగడానికి ఉపయోగపడే పరిచయమే బంధం కావొచ్చు. యీ పరస్పర వ్యాపార సంబంధానికి రవ్వంత ఎమోషన్స్‌ని జోడిస్తే బంధం ఏర్పడుతుంది. యీ పరస్పర వ్యాపార సంబంధాన్ని ఎంతకాలం సజీవంగా వుంచుతామో అంతవరకు బంధం వుంటుంది. యిప్పుడే జీవితాలని పాత పద్ధతుల్లో అర్థం చేసుకొని డీల్ చేస్తే దుఃఖమొక్కటే మిగుల్తుంది. అందుకే అన్నాను నిత్యకళ్యాణికి డీల్ చేసుకోవటం రాదని' అంది ప్రవీణ.

సంజన నోటమాట రానట్టు వెర్రిగా ప్రవీణని చూస్తోంది. 'తనలాంటి ఓ అమ్మాయి యింత వివరంగా యిన్నేసి విషయాలని యింతలా మాట్లాడుతుందేంటి. యివన్నీ నిజమేనా...'

'నచ్చలేదా సంజనా? ఏం మీ ఆఫీసులో పైకి రావాలని మీ స్కిల్స్ పెంచుకోవడానికి, క్వాలిఫికేషన్ పెంచుకోవడానికి ప్రయత్నించటం లేదా? వున్న వాళ్లలో జీవితాన్ని పంచుకోవడానికి మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ ఎవరని బంధువుల్లోనో, వెబ్‌సైట్స్‌లోనో, మ్యారేజ్ బ్యూరోస్‌లోనో ఎదగటానికి అవకాశం వున్న అమ్మాయిల కోసం చూడటం లేదా. తమ కంటే తాము చేసుకొనే అమ్మాయిలు బై ఆల్ మీన్స్ సౌండ్‌గా వుండాలని అనుకొంటున్నారు. అప్పుడే ఎవైలబుల్‌గా వున్న కంఫర్ట్స్‌ని, ఫన్‌ని త్వరత్వరగా ఎంజాయ్ చేయొచ్చనుకుంటున్నారు. నో, యిందులో వెన్నుపోటులేం లేవు' బ్రష్‌లో చిక్కుకున్న వెంట్రుకల్ని తీసి డస్ట్‌బిన్‌లో పడేస్తూ అంది ప్రవీణ.

'యివన్నీ మీరిద్దరూ మాట్లాడుకున్నారా' ఆశ్చర్యంగా అడిగింది సంజన.

'యివన్నీ పత్తిపనిలా మాట్లాడుకోలేదు. అవే అర్థం అవుతుంటాయి. ఒక్కో మెట్టూ ఎక్కుతూ పైకి వెళ్లటం శ్రమ, టైమ్ వేస్ట్. లిఫ్ట్‌లో ఒక్కసారే కావాలనుకొన్న ప్లేస్‌కి ఠకీమని వెళ్లిపోవచ్చు. ఏమంటావ్? లిఫ్ట్ లేనిచోట నేను మెట్లు ఎక్కి వెళ్లను. అలాంటివి రిజెక్ట్ చేస్తా. వెస్ట్రన్ ఫిట్టింగ్స్‌ని రోజూ వేసుకోవటమే కాదు సంజనా, అలా ఆలోచించటం కూడా నేర్చుకో. సినిమాకి వెళదామా' అడిగింది ప్రవీణ.

'నే రాలేనిప్పుడు'

'ఓ... సంతాపమా... గుడ్‌లక్... బై' హేండ్‌బ్యాగ్ తీసుకొని ప్రవీణ బయటకి వెళ్లిపోయింది.

నిత్యకళ్యాణి కళ్లల్లోంచి ధారగా నీరు. ఆమె ఒక్కమాట మాట్లాడలేదు. సంజనా ఆమెని డిస్టర్బ్ చేయలేదు. రాత్రి బాగా పొద్దుపోయాక ప్రవీణ వచ్చింది. అప్పటికి నిత్యకళ్యాణి మంచంపై పడుకొని వుంది. నిత్యకళ్యాణి శిరీష్ విషయాలేమైనా మాట్లాడుతుందేమోనని ప్రవీణకి కాస్త బెరుగ్గానే వుంది.

నిత్యకళ్యాణి ఎప్పటిలానే తన పనులన్నీ చేసుకొంటోంది. ప్రవీణతో ఎప్పటిలాగే వుంది. ప్రవీణ మాత్రం నిత్యకళ్యాణిని ఆ ఉద్యోగం నుంచి దూరం చేయాలనుకొంది. ప్రయత్నాలు చేస్తుండేది. ఎందుకో ఆవిడకి ఏవి కలిసొచ్చేవి కాదు. కళ్యాణి శిరీష్ విషయంలో తనతో ఏం మాట్లాడకపోవటం యిద్దర్ని పూర్తిగా యిగ్నోర్ చేయటం ప్రవీణకి లోపలెక్కడో కాల్తోంది.

సంజనా తన యం.బి.ఏ.లో మునిగిపోయింది.

ఏడాది తిరిగేటప్పటికి నిత్యకళ్యాణి న్యూస్ సెక్షన్‌కి ఇన్‌ఛార్జ్ అయింది. కొత్తగా మరికొంతమంది అమ్మాయిలు పొలిటికల్ బ్యూరోలోకి వచ్చారు. ఉత్సాహం, హుషారు కలబోసి అంతా ఒక టీమ్‌గా పనిచేస్తుండేవారు.

ప్రవీణని యాంకర్‌గా ఎక్కువకాలం శిరీష్ ప్రమోట్ చేయలేకపోయాడు. ఆమె తనని ప్రమోట్ చేసేవాళ్ల కోసం వెతుకుతూనే వుంది. శిరీష్ తన ఫీల్డ్‌లో ఎదగడానికి కావలసిన స్కిల్స్, రాజకీయాలు, కాంప్రమైజ్‌లు నేర్చుకుంటూ తన ప్రొఫెషన్‌లో బిజీగా వున్నాడు.

సంజనా యం.బి.ఏ. పూర్తయింది. ఓ మల్టీనేషనల్ కంపెనీలో టీమ్‌లీడర్‌గా ఉద్యోగం వచ్చింది. లండన్ వెళ్లేముందు నిత్యకళ్యాణికి పార్టీ యిస్తానని ఓ రెస్టారెంట్‌కి పిలిచింది.

లాన్‌లో కూర్చున్నారిద్దరూ.

పల్చని మంచు వెన్నెల జల్లు.

యిద్దరిమధ్యా హరికేన్ లాంతరు లేత వెలుగు.

'నిత్యా! ఎప్పట్నుంచో చిన్న క్యూరియాసిటీ. నువ్వు శిరీష్‌తో యీ విషయం మాట్లాడలేదెందుకు. ఎలా నిలబడగలిగావ్' కుతూహలంగా అడిగింది సంజన.

నిత్యకళ్యాణి చిన్నగా నవ్వి 'చెపుతా. కానీ యిప్పుడు కాదు. మరోసారి' అంది.

సంజనా తిరిగి ఆ టాపిక్ తీసుకురాలేదు.

తరువాత రోజు సంజనాకి ఎయిర్‌పోర్ట్‌లో సెండాఫ్ యిస్తూ ఓ చిన్న గిఫ్ట్ ప్యాక్ యిచ్చింది నిత్యకళ్యాణి.

టేక్‌ఆఫ్ అయి ఆకాశంలో విమానం సెటిల్ అయి ఏ ఒడిదుడుకులు లేకుండా వెళుతున్నప్పుడు నిత్యకళ్యాణి యిచ్చిన కవర్ విప్పింది. నైటింగేల్ పుస్తకంలో నల్లని యింక్‌పెన్‌తో రాసిన గుండ్రని చేతిరాత.

సంజనా,

నువ్వు వెళుతున్నావంటే బోల్డంత దిగులేసింది. కాని తప్పదు. మా యింటి నుంచి ఉద్యోగం కోసం యీ వూరొచ్చినప్పుడూ నే బెంగపడ్డాను. నిత్యం యిష్టమైన స్వరం వినాలనీ, యిష్టమయిన వాళ్లతో జీవించాలని వుంటుంది. కాని సాధ్యం కాదు కదా. నువ్వు అడిగావే నా ప్రేమానుభవం ముగిసిపోయినప్పుడు నేనెలా వున్నానని. నీతో పంచుకోవడానికి నాకేం అభ్యంతరం లేదు. యింతకాలం తరువాత ఒక అవుట్‌సైడర్ స్థితికి నేనొచ్చేశాక ఆ విషయాలు మాట్లాడటం ఓ అనుభవం. యిందులోంచి నీకూ ఏదైనా పనికిరావొచ్చు. నచ్చొచ్చు. ఏం అనిపించకపోవచ్చు. నీక్కావల్సింది ఏమైనా వుంటే తీసుకోవచ్చని కాస్త వివరంగానే రాస్తున్నాను.

యిది మార్గశిరమో, శ్రావణమో తెల్సుకోలేకపోయానీవేళ. సన్నని జల్లు. పైనంతా మబ్బు. వానాకాలపు వెలుతురులో రోడ్లు, యిళ్లూ, గోడలూ, చెట్లూ మెరుస్తున్నాయి. కొబ్బరాకుల నుంచి జారుతూ నీటి బిందువులు. యిలాంటి వానాకాలపు రాత్రుల్లో పాటలు వింటూనో, పుస్తకాలని చదువుకుంటూనో యింట్లో అటూ ఇటూ పచార్లు చేస్తుండేదాన్ని. వానంటే చాలిష్టం. యింటి నుంచి దూరంగా వచ్చినా వానని ఆస్వాదిస్తూనే వున్నాను. పుస్తకాలు, పాటలు నాతోనే వున్నాయి. భావప్రపంచం విస్తరించింది.

శిరీష్... కవి. పుస్తకాలంటే యిష్టం. అంతో యింతో భావుకుడు. యిష్టపడ్డాం. అయితే నే దుఃఖపడ్డాను. అతన్ని ఏం అడుగుతాం. మాటలని అర్థం చేసుకొనే స్థితిలో అతనుంటే నన్నెందుకు వద్దనుకుంటాడు. యిన్ని రోజుల ఆలోచనల్లో నాకేమనిపించిందంటే యిష్టం, ప్రేమ, మోసం, అవకాశం, అసూయ ఏదైనా తీసుకో, జీవితంలోని ఏ రాగద్వేషాల షేడ్స్‌నైనా తీసుకో, వాటిని ఇన్‌ఫ్లూయెన్స్ చేసే పరిస్థితులు మన చుట్టూ ఆపరేట్ అవుతున్న సోషియో పొలిటికల్ ఎకనమిక్ కండిషన్స్‌పై వుంటాయనిపిస్తుంది. ప్రేమలో యిటువంటి ఎత్తులు, జిత్తులు, రాజకీయాలు, ప్రపోజల్స్, ఎమోషన్స్ ఓ పదిపదిహేనేళ్ల క్రితం వుండే అవకాశం లేదు. అప్పుడూ ప్రేమలో గాయాలుండేవి. కానీ వాటి రూపం సారం వేరు.

శిరీష్ ఒకప్పుడు నాకన్నీ. యిప్పుడు అపరిచితుడు.

అతనికి ముందూ నాకో జీవితం వుంది. అతని తర్వాతా జీవితం వుంది. జీవితానికి ముఖ్యమైన ఓ పార్శ్వపు ప్రేమ తిరిగి నా జీవితంలోకి రావొచ్చు. కాని ముగ్ధత్వంతో కూడిన ప్రేమ యిక సాధ్యం కాదేమో. నన్ను నేను ఎంత ఓదార్చుకున్నా, నచ్చచెప్పుకొన్నా ప్రేమ విషయంలో పూర్తిగా యిచ్చేసుకోలేనేమో. క్రిటికల్‌గా వుంటానేమో... ఆ మేరకు నష్టపోయాను. ఓ రకంగా యీ గాయం నుంచి కొన్ని విషయాలు తెలుసుకున్నాను. మానవ జీవితంలో పరిచయాలలో, స్నేహాల్లో, అనుబంధాల్లో యింత నిలకడలేనితనం, యిన్‌సెక్యూరిటీ, తడిలేనితనం యింతకు ముందెప్పుడూ లేదనుకొంటా. సాహిత్యం ఆయా కాలానికి సంబంధించిన జీవితానుభవాలని మనకి అందిస్తుంది కదా. ఎక్కడా యిలాంటి స్థితి లేదు. యీ వాతావరణంలో మనం హృదయానికి సంబంధించినంత వరకు బాధితులం.

పర్సనల్, అఫీషియల్ జీవితంలో నాకు ప్రశాంతిని యిచ్చిన స్నేహాలు పెద్దగా లేవు. కొన్ని స్నేహాల్లో విడిపోతున్నప్పుడు బాధని, బెంగని కలిగించాయి. ఎప్పుడూ నాకు ప్రశాంతి సాహిత్యంలోనే దొరుకుతుంది.

శిరీష్ గాయాన్ని సేదతీర్చింది సాహిత్యమే. కోపంతో, అసూయతో, బాధతో నన్ను నేను కోల్పోకుండా కాపాడింది సాహిత్యమే. యిందులో కొన్ని పుస్తకాల పేర్లు రాశాను. చదవాలనిపిస్తే చదువు. ఆ సాహిత్యం నిన్ను లాక్కుంటే నీ జీవన ప్రయాణంలో నీకో స్థిరమైన స్నేహం దొరికినట్టే.

ప్రేమ, జ్ఞానం, శక్తి ఏమైనా మనలోనే వుంటే ఏ కొత్త ప్రపంచం మననుంచి మనలని లాక్కోలేదు. మనం ప్రవహిస్తూనే వుంటాం.

ప్రేమతో,

నిత్యకళ్యాణి

వుత్తరాన్ని మధ్యమధ్యలో అలా అలా చదువుతూనే వుంది సంజనా. ఆ పుస్తకాల లిస్ట్‌పై ఆమె చూపులు నిలిచాయి.